

**కమల:**

బి. యే. పరీక్షలు వ్రాయటం పూర్తవగానే విజయవాడ వెళ్ళేను.

విమలను చూసి సరీగ్గా సంవత్సరమయింది అప్పటికి. విమలా, నేను చిన్ననాటి స్నేహితురాళ్ళం. ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకోకపోయినా రోజులో చాలాభాగం యిద్దరమూ కలిసే గడిపేవాళ్ళం. సాధారణంగా మా యిద్దరి మధ్య దెబ్బలాటలు వచ్చేవి కావు. ఎప్పుడైనా వచ్చినా ఎవరో ఒకరం మాటలు కలపటానికి ప్రయత్నించేవాళ్ళం. కొద్ది నిమిషాల్లోనే మాదెబ్బలాట మర్చిపోయి మామూలుగా ఆడుకునే వాళ్ళం.

విమలకి వాళ్ళవాళ్ళు స్కూల్‌ఫైనల్‌తోనే చదువు మాన్పించి పెళ్ళి సంబంధాలు చూడటం ప్రారంభించేరు. నేను కాలేజీ చదువుకోసం కాకినాడ వెళ్ళేను. సెలవల్లో యింటికి వచ్చినప్పుడల్లా మా కబుర్లకు అంతులేది ఉండేది కాదు. గడ్డివాము చాటున, కాలవగట్టున, చెట్ల పొదల దగ్గర, ఎక్కడపడితే అక్కడ కూర్చుని గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవాళ్ళం. నేను మా కాలేజీ అమ్మాయిల ఫాషన్లు, లెక్చెరర్లు, విద్యార్థుల అల్లరి చేష్టలు మొదలైన వాటిని గురించి చెప్తే విమల మా గ్రామ రాజకీయాలనుండి తన పెళ్ళిచూపుల కోసం వచ్చిన అబ్బాయిలవరకు అన్నీ చెప్తూ వచ్చేది.

నేను బి. యే. ఫైనలియర్‌లోకి ప్రవేశించక ముందు వేసవిలో విమల పెళ్ళయింది. అప్పుడు నేను రెండవ సంవత్సరం పరీక్షలు వ్రాస్తుండటం వల్ల విమల పెళ్ళికి వెళ్ళలేక పోయేను. తరువాతకూడా విమల వచ్చినపుడు నేను ఊళ్ళో లేకపోవటం, నేను వచ్చినప్పుడు విమల లేకపోవటం జరగటంవల్ల మేమిద్దరం కలుసుకోవటం కుదరలేదు. మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం తరచుగా నడుస్తూండేవి

పరీక్షలవగానే యింటికికూడా పోకుండా సరాసరి విజయవాడ ప్రయాణమయ్యేను. రైల్లో ప్రయాణం చేస్తున్నంతసేపు, మా యిద్దరి స్నేహాన్ని గురించి ఆలోచించుకుంటూ గడిపేను.

రైలు విజయవాడ స్టేషనులో ఆగగానే విమల నవ్వుముఖం కనిపించింది. ప్లాట్‌ఫారంమీద నేను అడుగుపెట్టగానే విమల గబగబ వచ్చి నన్ను కౌగిలించుకుంది.

మా యిద్దరికి అప్రయత్నంగా కన్నీళ్ళు వచ్చినయ్.

మాలోని భావోద్వేగం తగ్గి మేము మామూలు మనుషుల మయ్యేసరికి అప్పటికే విమల భర్త విశ్వం రెండు రిక్షాలు మాట్లాడటం, అందులో ఒకదాంట్లో నా సూట్‌కేసు పెట్టటం కూడా జరిగిపోయినయ్.

అంతవరకు ఆయన ఉనికినే మర్చిపోయిన మేమిద్దరం అటుచూసి సిగ్గుపడ్డాం.

విమల యేదో అనబోతుండగా ఆయన

నవ్వుతూ 'నేనే యింక పరిచయాలెందుకు? మీ యిద్దరి స్నేహాన్ని గురించి నువ్వు రోజూ చెప్తుంటే వింటున్నాను. ఈరోజు ప్రత్యక్షంగా చూస్తున్నాను' అన్నారు.

నేను విమల ఒక రిక్షాలోను, విశ్వం రెండవ దాంట్లోను ఎక్కి బయలుదేరేం.

పెళ్ళయిన తరువాత విమల శరీరంలో చాలా మార్పు వచ్చింది. విమల పెళ్లికాక పూర్వం సన్నగా, సుకుమారంగా ఉండేది. ఇప్పుడు కొంచెం లావయింది. శరీర ఛాయ కూడా పెరిగింది. ముఖంలో ఒక కొత్త కాంతి, నడకలో ఠీవి వచ్చినయ్. ఐతే మనస్తత్వంలో మాత్రం ఎక్కువమార్పేమీ వచ్చినట్లు కనపడలేదు. అప్పటిలానే గల గల నవ్వుతూ దారిపొడుగునా కబుర్లు చెప్పసాగింది.

ఇంటికి చేరుకోగానే స్నానంచేసి కడుపు నిండా భోజనం తిని వళ్ళు తెలియకుండా నిద్రపోయేను. మళ్ళీ నిద్రలేచేసరికి సాయంత్రం నాలుగయింది. విమల, విశ్వం అప్పుడే ఫలహారం, కాఫీ తీసుకుని తీరికగా కూర్చున్నారు.

నన్ను చూడగానే విశ్వం నవ్వుతూ 'లేవారా? రండి. విమలకి ఒకటే ఆత్రంగా ఉంది మీరు ఎప్పుడు లేస్తారా, ఎప్పుడు హస్కు మొదలెడ్తామా అని' అన్నాడు.

'నేను వట్టి వాగుడు కాయనని మీరు మాటి మాటికీ చెప్ప నక్కరలేదు' చిరుకోపంతో అని లేచింది విమల. 'కమలా, రా. కూర్చో. టిఫిను తీసుకొస్తాను' అంటూ లోపలికి వెళ్ళింది.

విమల లేచివెళ్ళిన సోఫాలో కూర్చున్నాను నేను.

విశ్వం 'ప్రయాణం అదీ బాగా జరిగిందా ?' అనడిగేడు.

'థర్డ్‌క్లాసు రైలుపెట్టిలో ప్రయాణం ఎలా జరిగేదీ వేరే చెప్పాలా ?' అన్నాను నేను.

గట్టిగా నవ్వేడు విశ్వం.

కొద్దిసేపైనాక అన్నాడు విశ్వం. 'విమలకి మీరంటే పిచ్చిప్రేమ. మీ రూపం, గుణం, మీ అలవాట్లు, అభిరుచులు—ఒకటేమిటి—మీలో ఆమె మెచ్చుకోని విషయమంటూ లేదంటే నమ్మండి. ఒక్కొక్కప్పుడు ఆమె మీ మీద చూపుతున్న అభిమానానికి నాకు అసూయకూడా కలిగేది. కొత్తగా పెళ్లయిన స్త్రీ అయినా మొగుణ్ణి గురించి గొప్పలు చెప్పుకోవటం చూసేంకాని స్నేహితురాలిని గురించి డబ్బా వాయించటం ఎక్కడా చూళ్లేదు.'

అతనలా అంటుంటే నా కదోలా అనిపించింది.

నిజానికి నాకు మగవాళ్లతో మాట్లాడాలంటే అదోరకం బిడియం. అందులో మొదటినుండి ఆడపిల్లలబళ్లో చదవటం వల్ల ఆ బిడియం మరింత ఎక్కువయింది. అందుచేత విశ్వం అంత చనువుగా నాతో మాట్లాడుతుంటే సిగ్గనిపించింది నాకు.

నా చేతి గోళ్లకున్నరంగు వైపుచూసుకుంటూ తలవంచుకుని కూర్చున్నాను.

ఇంతలో విమల టిఫీను, కాఫీ తీసుకు వచ్చింది. వస్తూనే 'ఏమిటలా కొత్త పెళ్లికూతురిలా తల వంచుకుని కూర్చున్నావ్ ? మా వారేమన్నా జోక్ వేసేరేమిటి ?' అంటూ ఆయన పక్కనే కూర్చుంది.

నేను నవ్వాను.

విశ్వం 'అందరూ నీలానే ఉంటారేమిటి? ఆమెది కొంచెం మైల్డ్‌నేచర్!' అన్నారు.

విమల ముఖం చిన్నబోవటం నేను గమనించక పోలేదు.

కొంచెం మొహమాట పడుతూ నేను ఫలహారం, కాఫీ పూర్తిచేసేను.

ఆ సాయంత్రం ముగ్గురం కృష్ణానది వైపుగా షికారుకు వెళ్లాము.

షికారుకు బయల్దేరేముందు నేను డ్రెస్ చేసుకుంటూ అద్దంలో నా ప్రతిబింబాన్ని చూసుకున్నాను. పింక్ కలర్ మీద ఎర్రటి గులాబిపూలున్న నైలెక్స్ శారీ, ఎర్రబ్లౌజు, చెవులకు పెద్దరింగులు. మెడలో సన్నని గొలుసు. నాకంటికి నేనే ఎంతో అందంగా కనిపించేను. ఎంతో గర్వమనిపించింది నాకు.

వెంటనే ఆనాటి విమలరూపం గుర్తుకు వచ్చింది నాకు. బంగారపు జరీ పూలు కుట్టిన తెల్లని వట్టు చీర, జాకెట్టు, గుండ్రని మెడను స్పృశిస్తున్న వెడల్పాటి నల్లపూసల దండలలో విమల ఎంతో హుందాగా కనపడింది.

వాలో ఎంత అందమున్నా ప్రస్తుతం విమలలోవున్న నిండుదనం దర్జా లేవనిపించింది నాకు. వివాహంవల్ల విమల సౌందర్యం పరిపూర్ణత చెందిం..

అలా అస్తవ్యస్తంగా ఆలోచించుకుంటూన్న నేను 'ఇంకా ఎంతసేపే నీ సింగారం ?' అన్న విమల పిలుపుతో ఉలికిపడి చూసేను.

గుమ్మందగ్గర నిలబడిన విమల నన్నో సారి ఆపాదమస్తకం పరిశీలనగా చూసింది.

ఇదివరకైతే అలా చూసిన వెంటనే విమల నన్ను కౌగలించుకొని 'అచ్చు అప్సరసలా ఉన్నావే !' అనో 'అపరంజి బొమ్మమనే నీవు' అనో అనేది.

కాని యిప్పుడు నన్ను చూట్టం అవగానే వెంటనే కళ్లు వాల్చేసుకుని 'త్వరగా రా. బయట రిక్షాలు నిలబడి ఉన్నయ్' అంటూ వెనక్కి తిరిగింది.

ఆమె అలా వెనుదిరిగినప్పుడు ఆమె ముఖంలో ఏవో నీలినీడలు కదలాడినట్లు నాలోని అంతర్నేత్రం యిట్టే చూడగలిగింది.

ఐతే కృష్ణ ఒడ్డున ఉన్నంతసేపూ విమల ఎంతో హుషారుగా ఉంది. వేరుశనగకాయలు, సోడా కొన్నది. కొత్తగా వచ్చిన తెలుగు సినిమాలను గురించి పత్రికలు, ప్రజలు ఏమంటున్నదీ చెప్పింది. మర్నాడు ఫస్ట్‌షోకి టికెట్లు రిజర్వు చేసి ఉంచమని భర్తను ఆజ్ఞాపించింది.

విశ్వం సరేనని. విమలను చూట్టానికి అతనికి రెండుకళ్లు చాలటంలేదా అనిపించింది.

వీళ్లిద్దరూ ఒకరి నొకరు హాస్యాలాడుకోవటం, వెక్కిరించుకోవటం, వోరచూపుల ద్వారా శృంగార భావాలను ప్రసారం చేసుకోవటం ఒకటి, రెండు సార్లు నేను చూట్టం లేదనుకుని విశ్వం విమల నడుం మీద, మెడమీద చెయ్యివెయ్యటం అన్నీ గమనించిన నాకు ఎందుకో దిగులనిపించింది. ఏదో ఒంటరితనం ఫీలయ్యాను. అంతేకాక నా అంతరాంతరాల్లో విమలమీద ఒక రకమైన అసూయకూడా కలిగింది.

ఐతే ఆ భావాలన్నిటినీ యింటికి వెళ్ళేసరికి మర్చిపోయేను. రాత్రి భోజనాలైనాక పన్నెండు దాటే రకు ముగ్గురం పేకాడుతూ కూర్చున్నాం.

ఆటలో ఓడిపోయినపుడల్లా విమల

...మ్మనేది:- ఆమె వుడుకుబోతుతనం చూసి విశ్వం ఆమెను మరింత ఏడి పించేవాడు.

దాంతో విమల కోపంగా పేకముక్కలు అతనిమీదకు విసిరి లోపలికి వెళ్ళి పోయింది. విశ్వం లేచి ఆమెవెంట వెళ్ళేడు.

అతను విమలను మెల్లగా అనునయిం చటం, ముద్దులు పెట్టుకుంటూ, బతి మాలటం ఆ అర్ధరాత్రి నిశ్శబ్దంలో స్పష్టంగా వినగలిగిన, నా మనసు అదో లాగై పోయింది. ఐదు నిమిషాల తరువాత యిద్దరూ తిరిగి వచ్చేరు.

మళ్ళీ ఆట మొదలెట్టేం.

భర్తచేత బ్రతిమాలించుకు వచ్చిన తరువాత విమల కళ్ళల్లో — బుగ్గలలో ఒక చిత్రమైన కాంతి వచ్చింది.

మాటిమాటికీ విమల భర్తమీదకు ఒరిగిపోవటం అతనేదైనా జోక్‌చేసినపుడు గట్టిగా నవ్వుతూ అతని వీపుమీద, తొడమీద కొట్టటం, విశ్వం ఎర్ర బారిన కళ్ళతో విమలవంక ఆరాధనగా చూడటం అన్నీ గమనించేక యింక నా మనసు ఆటమీద లగ్నం కాలేదు.

# అపార్థం

'నాకు నిద్రవస్తోంది. ఆట ఆపేద్దాం.' అంటూ లేచేను నేను.

ఆ రాత్రి చాలాసేపటివరకు నాకు నిద్ర పట్టనేలేదు.

**విమల :**

సంవత్సరం గడిచేక మళ్ళీ యిప్పుడు చూసేను కమలను. కమల నన్ను చూసి ఏమనుకుంటుందో !

మేము హైస్కూల్లో చదువుకునే రోజుల్లో మా యిద్దరికీ పెళ్ళన్నా, మగ వాళ్ళన్నా యిష్టం ఉండేదికాదు. జీవి తాంతం కన్యలుగా ఉండి, ఉద్యోగం చేస్తూ ఏదో దేశాన్ని ఉద్ధరించాలనుకునే వాళ్ళం. ఆ రోజులు గుర్తుకు వస్తే యిప్పుడు నవ్వొస్తుంది కూడాను.

రైల్వేస్టేషనులో కమలను చూడగానే నా కళ్ళు చెదిరిపోయినయ్. ఎంత అందంగా ఉంది కమల !

సంతోషం పట్టలేక దానిని గట్టిగా కౌగలించుకుని ఏడ్చేసేను కూడాను.

వస్తూనే కమల స్నానం భోజనం ముగించుకుని నిద్రపోసాగింది. ఎన్నో రోజుల తరువాత కలుసుకున్నాం కదా చక్కగా మాట్లాడుకుందామంటే అదేమో గుర్రుపెట్టి నిద్రపోతోంది. అక్కడికీ ఒకటి, రెండుసార్లు గదిలోకి వెళ్ళి చప్పుడు చేసాను కూడాను. ఐనా దానికి మెలకువ రాలేదు. చిన్నప్పటినుండీ అదంతే. దానిది వట్టి మొద్దునిద్ర. వోసారి నిద్రా దేవత ఒడిలోకి ఒరిగిందంటే యింక దానిని మేల్కొలపటం బ్రహ్మతరం కూడా కాదు.

నేను మాటిమాటికీ దాని గదిలోకి వెళ్తూండటం చూసి ఆయన 'ఆమెను డిస్టర్బ్ చెయ్యకు. ప్రయాణపు బడలి కతో నిద్ర పోతోంది' అన్నారు. ఇంక చేసేదిలేక వెళ్ళి ఆయన పక్కనే కూర్చుని మా చిన్ననాటి కబుర్లు చెప్ప సాగాను.

మధ్యాహ్నం రెండయినా కమల లేవ లేదు. నేను పకోడీలు, కాఫీ తయారు చేసేను. మేమిద్దరం తినటం అయినాక అరగంటకు లేచింది కమల.


నిద్రకళ్ళతో, రేగిన జుట్టుతో మా దగ్గరకు వచ్చింది కమల. ఈ ఒక్కసంవ త్సరంలోనే కమల అందం చాలా పెరి గింది. ఆయనకూడా నాలాగే కమలను రెప్పవాల్చకుండా చూస్తున్నారు. ఔను ! కమల అందం అలాటిది. ఆడా, మగ అన్న భేదం లేకుండా ఎలాటివారి దృష్టి నైనా నిల్పివేయగలిగే రూపం ఆమెది. కాని...కాని నా మనసులో ఎక్కడో చిన్నగా ముల్లుగుచ్చుకున్నట్లనిపించింది.

కమలకి టిఫిను తీసుకు రావటానికి లోపలికి వెళ్ళేను. ప్లేటులో పకోడీలు పెడ్తుండగా బయటనుండి ఆయన నవ్వు వినిపించింది.

ఎందుకో ఆయనంతగా పగలబడి నవ్వు తున్నారు ! ఆయన స్వభావమే అంత. ఎంత కొత్తవారితోనైనా యిట్టే కలిసి పోతారు.

నేను టిఫిను, కాఫీ తీసుకుని బయ టకు వచ్చేసరికి కమల కొత్త పెళ్ళి కూతురిలా సోఫాలో ముడుచుకుని కూర్చుంది. ఆయనముఖంలో చిరునవ్వు!

ఆ దృశ్యం చూసేసరికి నా వళ్ళు మండిపోయింది. అంత చదువుకున్నదై ఉండికూడా కమల మగవాళ్ళముందు ఎందు



కిలా సిగ్గులు మొగ్గలా నటిస్తుంది? అది జాణతనమా, లేక అమాయకత్వమా?

ఆయనంటాడు నాలాగా కాదుట కమల. ఆమెది షైల్డ్ నేచర్‌ట! ఔను. ఈ మగవాళ్ళకు పెళ్ళాం తప్ప మిగతా ఆడవాళ్ళంతా అద్భుతంగానే కనిపిస్తారు.

కొంతసేపైనాక నా ఆలోచనా పద్ధతికి నాకే పశ్చాత్తాపం కలిగింది. కమల నా ప్రాణ స్నేహితురాలు. ఎంతో నిష్కపటి. ఆయన స్వభావం ఎంత నిర్దుష్టమైనదో ఈ సంవత్సరంనుండీ చూస్తూనే ఉన్నాను. ఐనా నా మనసెందుకిలా పెడతోవ బట్టుతోంది?

నామీద నాకే అసహ్యం వేసింది. నాలో నాకు తెలియకుండా ఏదో వక్రదృష్టి తలెత్తుతోందేమోనని భయం వేసింది.

సాయంత్రం కృష్ణ ఒడ్డుకి షికారు వెళ్ళాం.

పెళ్ళప్పుడు కమల అప్సరసలా అలంకరించుకుంది. నైలెక్స్ చీరలో దేవకన్యలా మెరిసిపోతున్న కమలను చూడగనే నాకు మైకం క్రమ్మినట్లయింది. ఈ రూపంలో కమలని ఆయన చూస్తే...?

అసలే మగవాళ్ళది చంచల ప్రకృతి. భార్యకంటె అద్భుతమైన అందంగల ఆడది ఎదురుగా ఉంటే కనీసం మానసికంగానైనా చలించకుండా ఏ పురుషుడైనా...?

నన్ను అసూయా పిశాచం ఆక్రమించుకుంటోంది. నాకు తెలుసు. కాని ఎంతగా ప్రయత్నించినప్పటికీ నాలోని ఆ భావాన్ని చంపుకోలేక పోతున్నాను.

ఒక సంవత్సరం క్రితంవరకు కూడా కమలవంటి సౌందర్యవతి నా స్నేహితురాలైనందుకు నేనెంతో గర్వపడేదానిని. కాని యిప్పుడా అందమే నా గుండెను కోసివేస్తోంది.

నిజానికి నాకు కమలమీద అసూయ యేమీ లేదు. కమల అందాన్ని చూసి నా భర్త ఎక్కడ చలిస్తాడోననే నా భయం.

కృష్ణ ఒడ్డున కూర్చున్నంతసేపూ ఆయన నోకంట కనిపెడుతూనే ఉన్నాను. ఐతే నేనూహించుకున్నట్లు ఆయన కమల అందానికేమీ ముగ్ధుడైనట్లు కనబడలేదు. ఆమె ఉనికినే గుర్తించనట్లు మామూలుగా నామీద జోక్సు విసురుతూ, మధ్యమధ్య కొంటెచేష్టలు చేస్తూ నన్ను నవ్వించేరు. రాత్రి పేకాట దగ్గరకూడా అంతే. మాటిమాటికీ నేను వోడిపోతూండే సరికి నాకు ఉక్రోషం వచ్చి, పేకముక్కలాయనమీదకు విసిరేసి వెళ్ళిపోయేను. ఐనా ఆయనకు కోపం రాలేదు. పైగా ఎంతగానో బ్రతిమాలి ఆటలోనికి తీసుకువెళ్ళేరు. సాయంత్రంవరకు అలాంటి మనిషిని అనుమానించినందుకు నేను సిగ్గుపడ్డాను. నిజంగా ఆయన దేవుడు.

మర్నాడు పగలంతా కులాసాగా గడచింది. ఆయన ఆఫీసుకు వెళ్ళి వచ్చే వరకు మేమిద్దరం ఎన్నోరకాల కబుర్లు చెప్పుకుంటూ గడిపేం. కమలది ఎంతో సరళమైన స్వభావం. పొరపాటునకూడా తన మాటలతో, చేతలతో ఎదుటివ్యక్తిని నొప్పించదు. అలాటి స్నేహితురాలిని చూసి నేను అసూయ పడ్డానంటే నా అంత మూర్ఖురాలు మరొకతి ఉండదు.

దాంతో మాట్లాడుతున్నంతసేపు మేము హైస్కూల్లో చదువుకున్న రోజులే జ్ఞప్తికి వచ్చినయ్. ఒక్కొకసారి రాత్రిళ్ళు మేమిద్దరం ఎవరో ఒకరియింట్లో ఒకే మంచంమీద పడుకుని తెల్లవారు ఝాము వరకు కబుర్లతో గడిపేవాళ్ళం. మళ్ళా ఒకసారి అలా కమలదగ్గర పడుకుందామనిపించింది నాకు. నా కోరికను వెల్లడిచెయ్యగానే సంతోషంగా అంగీకరించింది కమల.

సాయంత్రం ఆయన రాగానే మేము ఫలహారం కాఫీ తీసుకుని 'మేరే మెహబూబ్' సినిమాకు వెళ్ళేం. స్నేహితురాలికోసం తన ప్రేమనుకూడా త్యాగం చెయ్యగలిగిన ఆ స్త్రీ గాథ నన్నెంతో కదిలించి వేసింది. ఔను. సృష్టిలో తియ్యనిది స్నేహమొక్కటే!

సినిమా అయినాక హోటల్లో భోజనం చేసి యింటికి వచ్చేం. అప్పటికి పదకొండు దాటింది.

నేను కమలదగ్గర పడుకుంటానని ఆయనతో చెప్పటానికి గదిలోకి వెళ్ళేను. ఆయనకి చాలాకోపం వచ్చింది.

'పెళ్ళయినాక కూడా అదేం స్నేహం? అంత పడి చచ్చేదానివైతే ఆ కమలనే పెళ్ళిచేసికోకపోయేవా?' అన్నారు.

---

అన్నానికి ఆదరువు

# అడ

రెండు కప్పుల బియ్యం, ఒకొక్క కప్పు, కందిపప్పు, మినపప్పు, పచ్చిమిరపకాయలు, ఎండుమిరప కాయలు అల్లంముక్క, చిన్న ఇంగువ ముక్క, కొత్తిమీరి, కరివేపాకు ఉప్పు—

బియ్యం, పప్పులు శుభ్రంచేసి నానపెట్టాలి. ఓ మూడు గంటలేనా నాననియ్యాలి. బాగా నీళ్ళు వోడ్చి, పచ్చిమిరప కాయలు, ఎండుమిరప కాయలు, ఇంగువ, అల్లం, ఉప్పు వేసి రుబ్బుకోవాలి రుబ్బుకునేటప్పుడు కావలిస్తే కొంచెం నీరు పోస్తూ ఉండవచ్చు. కొత్తిమీరి కరివేపాకు వేసి రుబ్బి తీసుకోవాలి. పిండి మరీ గట్టిగానూ మరీ పల్చగానూ కాకుండా ఉండాలి.

దళసరి పెనం బాగా కాలనిచ్చి—పెనంమధ్య గరిటెతో పిండి పోయాలి. అడ చక్కగా గుండ్రంగా ఉండేలా గరిటెతో సర్దాలి. అడ మధ్య చిన్న కన్నంలా గరిటెకాడతో పిండి తొలగించి ఒక స్పూను నెయ్యిగాని నూనెగాని వేయాలి. అడ చుట్టూకూడా నూనె వేయాలి. బాగా కాలిందన్నాక అట్లకాడతో తిరగవేసి రెండోవైపున కూడా కాలనివ్వాలి. అడ పెనానికి అంటుకుందంటే, విరిగిందంటే, మధ్య నల్లగా మాడిందంటే—పెనం ఎక్కువ వేడిగానైనా ఉండి ఉండవచ్చు, వేడి తగ్గి అయినా ఉండవచ్చు.

ఈ అడకి కొబ్బరి పచ్చడి, ఊరగాయలు, బెల్లం, జామ్, తేనె ఏదైనా నల్చుకుందుకు బాగా ఉంటుంది.

—కె. ఆర్.

ఆయన కోపంచూస్తే ముచ్చటవేసింది నాకు.

ఆయన నుదుటిమీద ముద్దుపెట్టుకుని 'ఈ ఒక్కరాత్రికి...' అంటూ బతిమలాడాను. ఆయన ససేమిరా వినలేదు.

'నేనొక్కణ్ణే పడుకుంటే నాకు నిద్రపట్టదు' అంటూ వెళ్ళబోతున్న నా పమిటచెంగు పట్టుకుని లాగారు.

ఇంతలో 'విమలా!' అంటూ వచ్చింది కమల.

ఆయన నా పమిటచెంగు వదిలేసేరు. ఓ సారి ఆయనని కళ్ళతోనే వెక్కిరించి కమలదగ్గరకి వెళ్ళిపోయేను నేను.

అప్పటికే పన్నెండు కావస్తోంది. అలసిపోయి ఉన్నందువల్ల నేను, కమల ఎక్కువ మాట్లాడుకోకుండానే వెంటనే నిద్రలోకి ఒరిగేం.

ఉన్నట్టుండి ఎవరో వెన్నుమీద చరచినట్లు మెలకువ వచ్చింది నాకు. కమల పక్కమీదనుండి సగం లేచి 'ఏమిటి?' అంటోంది.

మా మంచం దగ్గరే బెడ్‌లైట్ వెలుగులో బిత్తరచూపులతో ఆయన!

నేను కళ్ళు తెరవగానే 'విమలా!' అన్నారు.

ఈ సమయంలో యీయన యిక్కడికి ఎందుకు వచ్చినట్లు? నా కంటె ముందుగానే మేల్కొన్న కమల యీయనతో ఏం మాట్లాడుతోంది? ఆయన నన్ను కమలదగ్గర పడుకోవద్దనటానికీ, యీ సంఘటనకీ ఏమైనా సంబంధం ఉందా? నా తల తిరిగి పోతోంది ఆలోచనలతో.

'ఏం కావాలి మీకు?' కఠినంగా అడిగేను.

'త...తలనొప్పి...'

'తలనొప్పిగా ఉంటే మీ గదిలోనే అమృతాంజనం ఉంది, రాసుకోండి. అర్ధరాత్రివేళ యీ నాటకా లెందుకు?' యీసడింపుగా అని పక్కకి తిరిగి పడుకున్నాను.

నాకు దుఃఖం ఆగలేదు. వీళ్ళిద్దరూ నన్నెందుకిలా మోసం చేస్తున్నారు? కమల పైపై మెరుగులు చూసి రెండు రోజుల్లోనే ఆయనింతగా దిగజారి పోయేడా? ఛీ! మగవాళ్ళంతా అంతే! భౌతికాకర్షణల ముందు ఎంతటి నైతిక

# అపార్థం

విలువలను కూడా లెక్కచెయ్యరు.

అసలు పెళ్ళిచేసుకోవటమంత బుద్ధి తక్కువపని మరొకటి ఉండదు. అనుక్షణం భర్త ప్రేమకోసం ప్రాకులాడుతూ ఆయన కొంచెం ప్రేమ నటిస్తే పొంగిపోయి, మోసం చేస్తే క్రుంగిపోయి, నిమిష నిమిషానికీ చస్తూ బతుకుతూ ...ఛ! ఎందుకొచ్చిన జీవితం యిది?

ఆ రాత్రి నాకింక నిద్రపట్టనే లేదు. జీవితమంటేనే విరక్తి పుట్టింది. కమల మాత్రం హాయిగా పడుకొంది. తోటి ఆడదాని గుండెలో చిచ్చుపెట్టి అంత నిశ్చింతగా ఎలా నిద్రపోగలుగుతోందో!

తెలతెలవారు తుండగానే లేచి వెళ్ళిపోయేను నేను. నిద్రలేమివల్ల మెదడుకు కొంత అలసటగా ఉన్నా, మనసులో రోషం, దుఃఖం అతిగా ఉండటంవల్ల ఆ వేడిలో యింటిపనులన్నీ చకచక చేసుకుపోసాగేను.

ఆరుగంటలకి కమల మరో అరగంట తరువాత ఆయన లేచేరు. నాకైతే వాళ్ళిద్దరి ముఖాలు చూడటానికి కూడా అసహ్యం వేసింది. అందువల్ల ఎక్కువసేపు వంటింట్లోనే ఉండి వోకంట వాళ్ళిద్దరినీ కనిపెట్టసాగేను.

కమల ముఖం కడుక్కుని అరచేతి మందాన పౌడరద్దుకుని సోగ్గా సోఫాలో చేరగిలబడి కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటోంది పెళ్ళికాని పిల్లకి పొద్దున్నే ఆ సోకులెందుకో! పొద్దున లేచిన దగ్గరనుండి వంటింటి చుట్టూ పెంపుడు పిల్లిలా తిరిగే ఆయన యివ్వాళ యీ ఛాయలకు కూడా రాలేదంటే అందులోని అంతరార్థం యేమిటి?

ఉప్మా, కాఫీ తయారుచేసి వాళ్ళిద్దరి ముందుపెట్టి ఒక్కమాటైనా మాట్లాడకుండా గిరుక్కున వెనక్కితిరిగి వచ్చేసేను. కాఫీ తాగాక కమల స్నానానికి వెళ్ళింది. కమల వెళ్ళిన రెండు నిమిషాలకి ఆయన గదినుండి బయటకు వచ్చేరు. కాసేపు వంటింటి ముందు తచ్చాడి, తరువాత (బహుశా నేనాయన్ని గమనించటం లేదన్న ధైర్యంతో కాబోలు) బాత్‌రూము వైపుకు వెళ్ళేరు. నాగుండె దడదడలాడింది. ఆయన అటువైపుగా ఎందుకు వెళ్తున్నట్లు? మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ ఆయన వెనకనే వెళ్ళేను.

మా కెదురుగా రెండుగజాల దూరంలో ఉన్న బాత్‌రూమ్ తలుపులు భళ్ళున తెరుచుకుని బయటకు వచ్చింది కమల.

కమల ఆకారం చూస్తూనే స్తంభించి పోయేను నేను. శరీరంలో కొద్ది భాగాన్ని మాత్రమే ఆచ్ఛాదిస్తున్న లేత గులాబి రంగు టర్కీటవలు చుట్టుకుంది. అప్పుడే తడి ఆరిన, నగ్నంగా ఉన్న ఆమె బుజాలు, కాళ్ళూ చేతులు ఉదయం ఎండలో నిగనిగ మెరిసిపోతున్నాయ్. నుదుటిమీద చిందరవందరగా కదులుతున్న వెంట్రుకలు...

(నన్నుచూసి కాబోలు) కంగరుపడింది కమల. వెంటనే ముఖం మార్చేసుకుని (ఎంత జాణ!) 'చూడు విమలా! నా చీరా, జాకెట్టు సూట్‌కేసుమీద ఉన్నాయికాని కాస్త తెచ్చిపెడ్తావూ? ప్లీజ్!' అని లోపలికి వెళ్ళింది.

నేను తేరుకుని చూసేసరికి ఆయనక్కడ లేరు! (ఔను ఎందుకుంటారు? పానకంలో పుడకలా మధ్య నేను దాపురించేనయ్యె) కమల అలా బట్టలు లేకుండా తిరగటంలో ఉద్దేశ్యం ఏమిటి? ఇంట్లో ఒక మగవాడున్నాడన్న జ్ఞానం లేనంత పసిపిల్లా అది? నేను కనుక సమయానికి అక్కడికి రాకపోతే ఏం జరిగేది? ఆయనక్కడే నిలబడి గుటకలు మింగుతూ... లేదా, ఆమాంతం దాన్ని వాటేసుకుని...

ఉక్రోషంతో, బాధతో, దుఃఖంతో నా నరాలన్నీ కదలబారిపోయినయ్. ఎలాగో నిగ్రహించుకుని కమలకి బట్టలిచ్చేను. ఆరోజు భోజనం చెయ్యకుండానే ఆయన ఆఫీసుకు వెళ్ళిపోయేరు.

నేను గదిలో మంచంమీద పడుకుని గుండె పగిలేలా ఏడ్చేను. కాస్త ఉపశమనం కలిగేసరికి పన్నెండయింది.

ఎంతయినా కమల నా ప్రాణస్నేహితురాలు. పైగా యిప్పుడు మాయింటి అతిథి. ఆమెను సత్కరించవలసిన బాధ్యత నామీద ఉంది. అందువల్ల వెంటనే లేచి, లేనినవ్వు ముఖానికి పులుముకుని దాంతో మాట్లాడాను. భోజనానికి రమ్మని

# అపార్థం

ఎంతో ఆప్యాయంగా పిల్చేను.

అది కూడా యేమీ జరగనట్టే భోజనానికి వచ్చి కూర్చుంది. పెరుగన్నం తింటూ కమల 'నేను మధ్యాహ్నం ట్రైన్‌కి వెళ్ళిపోతున్నాను' అంది, ఎదురు చూడని ఆ వార్తకి విస్తుపోయేను నేను. కాని మనసులో కొండంతబరువు దిగిపోయినట్లు ఫీలయ్యేను. 'ఎంత తొందరగా యిది వెళ్ళిపోతే అంత మంచిది పీడ విరగడైపోతుంది' అనుకున్నాను.

పైకిమాత్రం 'అప్పుడే వెళ్తావా? ఇంకా రెణ్ణాళ్ళు ఉండరాదూ?' అన్నాను.

'కాదు అమ్మావాళ్ళని చూసి నాలుగు నెలలపైగా అయింది. వెంటనే వెళ్ళాలి' అంది లేస్తూ కమల.

**విశ్వం:**


విమల స్నేహితురాలు వచ్చిన దగ్గర నుండి నా పరిస్థితి ఇరకాటంలో పడింది. ఏ మాత్రం అరమరికలు లేని మా దాంపత్య జీవితంలో లేనిపోని స్ట్రెయిన్ కనిపించింది.

పెళ్ళయిన దగ్గరనుండి విమల నాతో ఎప్పుడు మాట్లాడినా కమలని గురించి ప్రస్తావించకుండా ఉండేది కాదు. ఒక్కోప్పుడు దాని వాగుడికి విసుగు పుట్టేది కూడా నాకు.

విమల వట్టి బోళామనిషి. ఏమిచ్చినా పట్టలేదు. నిజంగా వాళ్ళిద్దరి మధ్యా అంత గొప్ప స్నేహం ఉందోలేదో కాని, ఉన్నట్టు ఊహించుకుంటుంది విమల. అందుకే అదేం చెప్పినా శ్రద్ధగా వింటున్నట్లు 'ఊఁ' కొట్టి ఊరుకునే వాడిని.

కమల వచ్చినరోజున విమల సంతోషానికి పట్టపగ్గాలు లేవు. ఐతే ఒకటి మాత్రం గ్రహించేను. తన స్నేహితురాలి ముందు విమలమీద యేమైనా జోక్స్ వేస్తే దానికి నచ్చేది కాదు. వెంటనే ముఖం మాడ్చేసుకునేది. దాని మనసు కష్టపెట్టటం యిష్టంలేక నేనుకూడా జోక్స్‌వెయ్యటం మానేసేను.

కమల వచ్చినరోజు సాయంత్రం మేము కృష్ణ ఒడ్డుకి వెళ్ళేం. బయల్దేరే ముందు విమలముఖం కొంచెం కాంతి హీనంగా ఉంది. కారణం గ్రహించటానికి నాకాట్టే సేపు పట్టలేదు. పసిడి కాంతితో మెరిసిపోతున్న కమల ముందు తనెక్కడ తీసికట్టుగా ఉంటానోనని తన భయం. పిచ్చి విమల! తన అందం సంగతి ఆమెకే తెలియదు. వో ఛాయ తక్కువైతేనేం విమల ముఖంలోని ఆ కళ శరీరంలోని ఆ చైతన్యం— ఏ కొద్దిమంది స్త్రీలకో తప్ప ఉండదు. పైగా నేను ప్రాణాధికంగా ప్రేమించే విమలముందు ఎలాంటి అప్సరసలైన దిగదుడుపే! ఈ సంగతి ఎన్నిసార్లు చెప్పినా విమలకి నామీద నమ్మకం కుదరదు.




ఆ సాయంత్రం కృష్ణ ఒడ్డున ఉన్నంతసేపూ విమల సౌందర్యాన్ని తనివితీరా చూస్తూ కూర్చున్నాను. రాత్రి పేకాట దగ్గర ఏటికీ మాటికీ అది ఉడుక్కుంటుంటే ఎంతో ముచ్చటేసేది నాకు. వోసారి కోపంతో లేచి గదిలోకి వెళ్ళేసరికి ఇదే అదననుకుని నేను కూడా వెళ్ళి దానిని తనివితీరా ముద్దులతో నింపేసేను.

మర్నాడు ఆఫీసునుండి యింటికి వచ్చేసరికి విమల మంచి హుషారుగా ఉంది. కమల గొడవలోపడి నన్ను పూర్తిగా మర్చిపోయినట్లుంది. దాంతో నా మనసు చివుక్కుమంది. ఇది చాలదన్నట్లు సినిమా నుండి తిరిగివచ్చేక రాత్రికి కమల దగ్గరే పడుకుంటానన్నది. ఇక నాకు పిచ్చికోపం వచ్చింది.

మగవాడిలో ఉన్నంత ఉద్వేగం, ఆవేశం ఆడవాళ్ళలో ఉండదేమో! ఉదయం నుండి నాకు దూరంగా ఉండికూడా ఏమాత్రం చీకూ చింతా లేకుండా తిరుగుతున్న విమలని చూస్తే నా కాశ్చర్యం వేసింది. ఇక మాటలతో లాభం లేదనుకుని విమలని అమాంతం మంచంమీద పడేసి తలుపు గడియ పెట్టేద్దామనుకున్నాను. కాని కమల అదే సమయానికక్కడికి రావటంతో నా ప్రయత్నం ఫలించలేదు. నాకు నిద్ర పట్టలేదు. విమల సాహచర్యం ఆ సమయంలో నాకెంతో అవసరమనిపించింది.

వెంటనే లేచి హాల్లోకి వెళ్ళేను. స్నేహితురాళ్ళిద్దరూ ఒక మంచంమీద పడుకున్నారు. ఇద్దరు నిండుగా ముసుగు తన్ని పడుకోవటం వల్ల ఎవరెవరో పోల్చుకోలేక పోయేను. ఏమైనా అవసరముండి నేను పిలిస్తే వినపడేందుకుగాను నా గదివైపున పడుకున్నటుంది. విమల అని భావించి దుప్పటి తొలగించేను. 'ఏమిటి?' అంటూ లేచి కూర్చుంది కమల. విమలకూడా లేచి నన్ను నిరసనగా మాట్లాడింది. ఆ సంఘటనతో బిక్కచచ్చిపోయేను నేను.

వో పక్క విమల నన్నపార్థం చేసుకుందన్న బాధ, మరోవంక కమల కూడా నా శీలాన్నిగురించి శంకిస్తుందేమోనన్న భయం నన్నారాత్రి నిద్రకు దూరంచేసి

శయ:

తెల్లవారినాక విమల ప్రవర్తనకూడా విపరీతంగా ఉంది. దానికి నచ్చచెప్పబోతే గట్టిగా నామీద ఎక్కడ విరుచుకు పడుతుందోనని భయం వేసింది. అనవసరంగా కమల మా దాంపత్య జీవితాన్నిగూర్చి తేలికగా ఆలోచించవచ్చు. అందువల్ల విమల కోపం చల్లారేక, ఒంటరిగా ఆమెకు సర్ది చెప్పవచ్చునని ఊరుకున్నాను.

కమలకి ఒకవేళ నామీద యేమైనా అపోహ ఉంటే క్షమాపణ వేడుకుని దానిని తొలగించాలనుకున్నాను. ఆమె కోసం ఎక్కడ చూసినా కనపడలేదు. వంటింట్లో విమల ఒక్కతే ఉంది. ఆ పరిస్థితుల్లో విమలని పలకరించటానికి ధైర్యం చాల్లేదు నాకు. పెరట్లోకి వెళ్లేను. అప్పుడే స్నానంచేసి బయటకు వచ్చిన కమలవంటిమీద బట్టలు సరీగ్గా లేవు. దాంతో వెనక్కి తిరిగేను 'వెళ్లిపోదామని. ఎదురుగా విమల !

అంటే ఆమె నన్ను వెంబడించి వచ్చిందన్నమాట ! ఆమె కళ్లలోని భావాలను ఒక్క త్రుటిలో చదవగలిగిన నాకు మొదటిసారిగా విమలమీద అసహ్యం, కోపం కలిగినయ్. అనుమానానికికూడా ఒక హద్దనేది ఉంది. నిమిష నిమిషానికీ భర్త ప్రవర్తనని శంకించే స్త్రీ తను సుఖపడలేదు. అతనిని సుఖపెట్టలేదు. ఆ కోపంలో అన్నంకూడా తినకుండా ఆఫీసుకు వెళ్లిపోయేను.

కాని ఆఫీసుకు వెళ్లేక నా ఆలోచనలు మరో మార్గంలో పయనించ సాగినయ్. విమల ప్రవర్తనకి కోపంకన్నా ఎక్కువగా జాలి కలిగింది. ఆమె ప్రస్తుత ప్రవర్తనవల్ల నాకు కొంత బాధ కలిగినా ఒక స్త్రీగా ఆమె ఆరాటాన్ని అర్థం చేసుకోవటం, ఆమె భర్తనైన నా కర్తవ్యమనిపించింది. నే నెప్పుడూ అంతే ! ఎప్పుడైనా మాటా మాటా వచ్చి విమలమీద కోపం వచ్చినా ఆమెకు దూరంగా ఉంటే సరి, తప్పంతా నాదేనని విమల క్షమార్హురాలని అనిపిస్తుంది నాకు. అంతేకాక అప్పటివరకు ఆమెను ఎంతగా కోపగించుకున్నానో అంతకు రెట్టింపు ప్రేమ ఆమెమీద జనిస్తుంది. సరిగ్గా యిప్పుడు కూడా అలాగే జరిగింది.

'సాయంత్రం ఆఫీసరు దగ్గర పర్మిషన్ తీసుకుని విమలని చూడాలనే ఆత్రంతో రోజుకన్న ఓ గంట ముందుగానే యింటికి వెళ్లేను. నేను వెళ్లేసరికి విమల గదిలో మంచంమీద పడుకుని ఏడుస్తోంది. 'విమలా ఏం జరిగింది?' అంటూ ఆమెదగ్గరకు వెళ్లేను.

'కమల వెళ్లిపోయింది — వెళ్లేముందు ఈ ఉత్తరం నాకిచ్చిపోయింది'. రుద్ధ కంఠంతో అంటూ నా చేతికొక తెల్ల కాగితం యిచ్చింది విమల.

అందులో యిలా ఉంది !

'విమలా ! నిన్ను చూట్టానికి వచ్చేటప్పుడు నా మన సెంత సంతోషంగా ఉందో, అంత బాధతో వెళ్లిపోతున్నాను. మీ దంపతులమధ్య అనవసరమైన వ్యాకులపాటు కల్పించి అంతకుమించిన విషాదభారాన్ని మోసుకు పోతున్నాను. ఐతే దీనికి బాధ్యు లెవరు ? ఒకరకంగా చూస్తే ఎవరమూ కాదు. మరోరకంగా చూస్తే మనముగ్గురి బాధ్యతకూడా కొంత ఉందనిపిస్తుంది.

అసలు మన సమాజంలో స్త్రీ పురుష సంబంధానికి అధిక ప్రాధాన్యతనిచ్చి దానికి సంకుచితమైన పరిధుల నేర్పరచి మనం ఒక వికృతమైన మనస్తత్వాన్ని పెంపొందించుకుంటున్నా మనిపిస్తోంది. రక్త సంబంధం లేని యువతీ యువకు లిరువురి మధ్య నిర్మలమైన స్నేహభావం ఉండగల దన్నది మన ఊహకికూడా అందని విషయం. అందుకే మనసులో ఏ దురుద్దేశ్యం లేకపోయినా కొత్తగా పరిచయమైన స్త్రీ పురుషులిరువురు స్వేచ్ఛగా మాట్లాడుకోవటానికి సంకోచపడతారు మన దేశంలో.

మన పూర్వ సంబంధం ఎలాటిదైనా నేను మీ యింటికి వచ్చేక నేనొక పరస్త్రీనన్నభావం నీలోనే కాక మీ యిద్దరిలో కూడా దృఢంగా ఉంది. సహజంగా మనలో ఉన్న సంస్కారానికి అది తప్పని తెలిసినా తరతరాలుగా మనలో జీర్ణించుకుపోయిన నమ్మకాలు ఆచారాలు, అలవాట్లు మన ప్రవర్తనని సంకుచిత పరచసాగినయ్. ఇలా ఒకరినొకరు నిశితంగా పరిశీలించబోయి, ముగ్గురం ఒకరినొకరు అపార్థం చేసుకుంటూ ఒక జుగుప్సాకరమైన వాతావరణాన్ని సృష్టించుకుని అందులో యిమడలేక బాధ పడ్డాం. కాకతాళీయంగా సంభవించిన కొన్ని సంఘటనలు ఆ వాతావరణాన్ని మరింత కలుషిత పరచినయ్. ఈ పరిస్థితులనుండి మనకి విముక్తి కలగాలంటే నేను వెళ్లిపోవటమే తక్షణ కర్తవ్యమని నాకు తోచి వెళ్లిపోతున్నాను. మరో నాలుగురోజులు గడచేక యివన్నీ తల్చుకుంటే మనకి 'సిల్లీ'గా అనిపిస్తుంది. పశ్చాత్తాపం కలుగుతుంది. ఈ సారి కలుసుకున్నపుడు ఫ్రీగా, యింకా విశాల హృదయంతో ప్రవర్తించాలని కోరుకుంటాం. ఆ శుభ సమయం త్వరలోనే వస్తుందని ఆశిస్తూ — ఎప్పటికీ నీ స్నేహితురాలు కమల'.

